

# తడి

– ఎ.పుష్పాంజలి

కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

"అమ్మాయ్ సులో! నేనమ్మా అమ్మని". అవతల్నించి లక్ష్మీకాంతమ్మ గొంతు!

"నువ్వూ అల్లుడుగారూ పిల్లలూ క్షేమమేకదా. మరి పండక్కి ఎప్పుడు బయల్దేరుతారు? భోగినాటికొకరోజు ముందే వచ్చెయ్యండి".

'అలాగేలే' అంది సులోచన. ఆమె లక్ష్మీకాంతమ్మ పెద్దకూతురు. సంభాషణ చివర్లో "మరి వచ్చేటప్పుడు నా పొళ్లకమ్మలు మర్చిపోవుగదా" అంటూ ముగించింది లక్ష్మీకాంతమ్మ.

లక్ష్మీకాంతమ్మ పొళ్లకమ్మల మాటెత్తగానే సులోచనకి ఒళ్లు మండింది.

"ఈమెకు పొళ్లకమ్మల గొడవ తప్ప ఇంకోటి జ్ఞాపకం రాదేమో! వాటికోసమే పండక్కి పిలుస్తోందా ఏంటి? అనుకుంది.

మనిషికి డబ్బెక్కువైనప్పుడూ, అందునా అవతలి వ్యక్తి తన కన్నా కాస్త తక్కువలో ఉన్నాడని తెలిసినప్పుడూ, వెంటనే బాంధవ్యంలో మాధుర్యంకన్నా, గర్వంలో కాఠిన్యమే పై మెట్టులో ఉంటుంది. అప్పుడన్నీ అనుమానాలూ అపోహలే మరి!

వరండాలో కేన్ ఊయల్లో ఊగుతూ పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది సులోచన. "అసలా కమ్మలు తనదగ్గరుంటే ఎవరికేం నష్టం వచ్చిందట? అమ్మదగ్గరుంటే మాత్రం అమ్మ వాటిని పెట్టుకుంటుందా? బీరువాలో పెట్టి పూజ చేయాల్సిందే. ఇప్పుడెందుకో వాటిని తన దగ్గర్నుంచి లాగేయాలని పట్టుబట్టి కూచుంది" అనుకుంది.

"ఎందుకేమిటి? తనకు తెలియకుంటేగా? సువర్చలకి ధారాదత్తం చేద్దామనే తల్లి ఆ కమ్మలడగడం! అన్ని వస్తువుల్లానే ఇవికూడా సువర్చలపాలు కావల్సిందే!

అక్కసుగా ఊయల స్పీడు పెంచింది.

సువర్చల లక్ష్మీకాంతమ్మ రెండో కూతురు. సులోచన కన్నా చిన్నది. ప్రస్తుతం సులోచన తన భర్త పిల్లలతో విజయవాడలో ఉంటున్నది. హైస్కూలు చదువుతున్న పిల్లలనిద్దర్నీ రెసిడెన్షియల్లో చేర్పించింది. భర్త బిజినెస్‌లో స్థిరపడ్డాడు. సులోచనకి కూడా బ్యాంక్‌లో ఉద్యోగం. జీవితం పరిపూర్ణంగా ఉందని చెప్పడానిక్కావలసిన అన్నీ హంగులూ వాళ్లకున్నాయ్. సులోచనతో పోలిస్తే చెల్లి సువర్చల ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నట్లే. సులోచనలాగా సువర్చల పైచదువులు చదవలేదు. విద్యావంతుణ్ణీ, ధనవంతుణ్ణీ ప్రేమించి పెళ్లిచేసుకోలేదు. తన బావ శంకరాన్ని వ్యవసాయం తప్ప మరో ఉపలబ్ది లేనివాణ్ణీ ఏరికోరి పెళ్లిచేసుకుంది. ఆమె సులోచనలాగా ఇద్దరు పిల్లలతో సరిపుచ్చుకోక నలుగుర్ని కన్నది. పెద్ద సంసారం.

"అసలమ్మకి సువర్చలంటేనే ఇష్టం! తనన్నా తన పిల్లలన్నా అంత ఆసక్తిలేదు. తను జీవితాన్ని గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకోబట్టి ఈవాళ ఈ విధంగా ఉంది గాని, అమ్మకున్న పక్షపాత బుద్ధికి నాన్న పోయాక తన గతి ఏమై ఉండేదో."

తనమీద తను జాలిపడ్తూ తన కార్యసాధనకి గర్వపడ్డది సులోచన.

"చిన్నప్పుడు బడికి రమ్మంటే రాకుండా అమ్మ వెనక దాక్కునేది సువర్చల. నాన్న తిడుతుంటే "పోనీవయ్యా! ఈ ఆడ పిల్లలు చదివి ఏంచెయ్యాలంట?" అని అమ్మ వెనకేసుకొచ్చేది. అలా ప్రతి విషయంలో వెనకేసుకు రాబట్టే సువర్చల అలా పాడైంది. నా బావే నా బావే అంటూ శంకరం బావని పెళ్లిచేసుకుని అనుభవిస్తోంది..."

"చిన్నప్పుడు బడికి రమ్మంటే రాకుండా అమ్మ వెనక దాక్కునేది సువర్చల. నాన్న తిడుతుంటే "పోనీ వయ్యా! ఈ ఆడ పిల్లలు చదివి ఏంచెయ్యాలంట?" అని అమ్మ వెనకేసుకొచ్చేది. అలా ప్రతి విషయంలో వెనకేసుకు రాబట్టే సువర్చల అలా పాడైంది. నా బావే నా బావే అంటూ శంకరం బావని పెళ్లిచేసుకుని అనుభవిస్తోంది..."

"జీవితానికి ప్లానింగ్ లేకపోతే బతుకులు సువర్చల బతుకుల్లాగే ఉంటయ్" అనుకుని వ్యంగ్యంగా నవ్వుకుంది.

సులోచన ఇల్లెప్పుడూ నిత్యనూతనంగా ఉంచుకుంటుంది. ఏ సామానైనా కాస్త పాతబడ్డదన్న అనుమానంవస్తే చాలు. దాన్ని తీసేసి కొత్తది కొనాల్సిందే. అలా ఎన్ని సామాన్లు? గాస్ స్టవ్‌లూ, కుక్కర్లూ, డిన్నర్ సెట్లూ, గ్రైండర్లూ, అక్వాగార్డ్లూ, సోఫాసెట్లు, బెడ్స్, ఒకటేంటి? ఎన్నో... ఎన్నో? అసలు రవికి అత్తగారన్నా మరదలన్నా చాలా అభిమానం. టైం దొరికితే సాధ్యమైనన్ని సామాన్లు తమ క్వాలిస్‌లో వేసుకుని విడవలూరికి చేరుస్తుంటాడు. అలా తీసుకుపోవడం ఆయనకెంత మాత్రం విసుగనిపించదేమో!

అట్లా విడవలూరు చేర్చిన సామాన్లు అమ్మ ఉంచుకుందా? అబ్బే! రెండోసారి వెళ్లి చూసేసరికి ఏవీ ఉండవు. పొయ్యిలో కట్టెలు పెట్టి ఊదుకుంటూ నీళ్లు కాచాల్సిందే? పచ్చళ్లు రోట్లో రుబ్బాల్సిందే! భోజనాలు అరిటాకుల్లో చేయాల్సిందే! ఏం పద్ధతులో ఆమెవి! చాదస్తపు పద్ధతులు! అదేమంటే "ఆ... అటువంటిది నాకలవాటే ఏంటమ్మాయి?" అంటుంది. రవి మాత్రం "రోట్లో రుబ్బారా? చాలా బాగుంది" అంటుంటాడు. ఆ సువర్చల, అదేమిటో గానీ ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ, ఎంత సంతోషంగా ఉంటుందో! అందర్నీ నవ్విస్తూ ఎంత సరదాగా ఉంటుందో! దాని ముఖం! డబ్బులేనిచోట సంతోషం ఎక్కణ్ణుంచొస్తుందీ? అంతా నటన". ఉక్రోషంగా అనుకుంది సులోచన.

"చూడు రవీ. అమ్మ వస్తువులన్నీ సువర్చలకు చేరుస్తోంది" అని తను రవి దగ్గర బాధపడ్తే అతనేమన్నాడు?



ఇంటి వైద్యం
★ త్రిఫలా చూర్ణం రెండు గ్రాములు, ప్రవాళ భస్మం 500మి.గ్రా. రోజుకు మూడుసార్లు తేనెతో కలిపి వాడితే కళ్ళకలక తగ్గుతుంది.

"నీకవసరం లేని వస్తువులెక్కడుంటే ఏం సులో? ఐనా సువర్చల పరాయిదా"? అన్నాడు.

"మదరలు వండిపెట్టే కోడి కూర, మినప గారెలూ తిని తనమీద చాలా ప్రేమ అనుకుంటున్నాడు అమాయకుడు! అదంతా కాకాల బిజినెస్ అని తెలిస్తేగా"? రవిని మూర్ఖుడు గానూ, తననితాను చాలా తెలివిమంతురాలిగానూ ఊహించుకొని అతిశయపడ్డది సులోచన మరోసారి.

గత సంవత్సరం విడవలూర్లో పనిమనిషి సుబ్బమ్మ తనకి తలంటుతూ ఉంటే ఆమె చెయ్యి తగిలి తన కుడి చెవి కమ్మ మలి చుట్టు విరిగిపోయింది. అప్పుడమ్మ "ఉత్తచెవులతో ఉండకూడదమ్మా"అంటూ బీరువాలోనుంచి ఆ పొళ్ళ కమ్మలు తీసిచ్చింది.

అంతవరకూ బాగానే ఉంది. పెద్ద పగడాలూ మధ్య ముత్యాలు పొదిగిన ఆ కమ్మలు, తను ఎర్ర చీరలకి మ్యాచింగ్‌గా వేసుకుంటుంది. అవి ఆంటిక్స్‌లాగా ఉంటాయంటారు తన స్నేహితులు. ఆ విషయం రవికి చెపితే, ఆంటిక్స్ చూసుకోవాలే గానీ, వేసుకోకూడదు "సులో" అన్నాడు. ఇహప్పట్నించీ మొదలు ఆ కమ్మలు తే, తెస్తున్నావా? అని అమ్మ ఒకటే పోరు. ఆ కమ్మలు వేసుకునే హక్కు, తనకి మాత్రం లేదా? అసలు తను ఎప్పుడూ వాళ్ళకివ్వడమే తప్ప వాళ్ళదగ్గర్నుంచి ఎప్పుడైనా ఏమైనా ఆశించిందా? ఇన్నాళ్ళకి తను ఆ కమ్మలు మాత్రం తన దగ్గరుంచుకుంది. అదీ ఉంచుకోవాలనీ సొంతం చేసుకోవాలని కాదు. అమ్మ అవి కావాలని పట్టుబట్టేకొలదీ తనకీ పట్టుదల పెరుగుతోంది." తన చెవులకున్న ఆ పొళ్ళ కమ్మలని చేత్తో తడుముకుంటూ అనుకుంది.

"ఆ భాగ్యమ్మ పిన్నికి మాత్రం ఎల్లకాలం విడవలూర్లో తల్లి ఇంట్లో ఏం పని? ముగ్గురు కొడుకులున్నారే? ఎవరో ఒకరి దగ్గరుండొచ్చుగా! ఆహాఁ ప్రపంచంలో అక్కంటే ఇంకెవరికీ ప్రేమ లేదు. ఒక భాగ్యమ్మకి తప్ప. నాన్న పోయాక పర్మినెంటుగా తమ ఇల్లు చేరిపోయిందామె. పైగా "మా అక్కనొదిలి నేనెప్పుడూ లేనమ్మా. చచ్చిందాకా ఒకరికొకరం ఉండాల్సిందే" అంటుంది అదేం ప్రేమలో మరి...?

భాగ్యమ్మకూ లక్ష్మీకాంతమ్మకూ వయసులో దాదాపు పధ్నాలుగేళ్ల తేడా ఉంది. భాగ్యమ్మ పుట్టగానే తల్లి పోవడంతో చెల్లెలి పూర్తి బాధ్యత తనే తీసుకుంది లక్ష్మీకాంతమ్మ. ఆ కారణంచేత అది అక్కాచెల్లెళ్ళ అనుబంధం కాక, తల్లీ కూతుళ్ళ బంధమైంది. "తను దగ్గర్లేకపోతే అక్కనెవరు చూసుకుంటారు? అనుకుంటుంది భాగ్యమ్మ. ముగ్గురు కొడుకులూ మంచి ఉద్యోగాల్లో ఉన్నా వాళ్లదగ్గరికి చుట్టపు చూపుగా మాత్రం వెళుతుంటుంది.

"అసలు తనకి సువర్చలంటే కుళ్లా? తనకంటే బాగుంటుందని ఈర్ష్యా? అమ్మ సువర్చలకేదైనా ఇస్తే తనకేంటి బాధ? అమ్మ ఆ వస్తువులు వాడుకోలేదనా? సువర్చలంటే అసూయ చేతా? ఎందుకు తను బాధపడ్తోంది?"

ఇల్లాంటి అంతర్మధనం జరిగినపుడు ఆమె అంతులేని అశాంతికి లోనవుతుంది. వాళ్ళంతా ఒకరికొకరు తోడై తనమీద కుట్రలు పన్నుతున్నారనిపిస్తుంది. తనని వెలివేశారనిపిస్తుంది. రవి కూడా తన బాధ సరీగ్గా అర్థంచేసుకోలేదనిపిస్తుంది.



ఆ భాగ్యమ్మ పిన్నికి మాత్రం ఎల్లకాలం విడవలూర్లో తల్లి ఇంట్లో ఏం పని? ముగ్గురు కొడుకులున్నారే? ఎవరో ఒకరి దగ్గరుండొచ్చుగా! ఆహాఁ ప్రపంచంలో అక్కంటే ఇంకెవరికీ ప్రేమ లేదు. ఒక భాగ్యమ్మకి తప్ప. నాన్న పోయాక పర్మినెంటుగా తమ ఇల్లు చేరిపోయిందామె.

"ఈ విశాల ప్రపంచంలో తను ఒంటరి! తనకెవరూ లేరు. తన పిల్లలని ఎవరూ ప్రేమించడం లేదు. తన అశాంతికంతా అమ్మే కారణం"

ఈ నిర్ణయానికొచ్చేశాక తల్లిమీద అక్కసు తప్ప మరేం మిగలదు సులోచనకి.

ఆమె ఆలోచనల్లో సతమతమవుతూ ఊయల్లో ఊగిసలాడుతుండగానే రవి వచ్చాడు. తనకు అర్జంటు పనులున్నందువల్ల ముందు పిల్లలను సులోచనను వెళ్లమనీ తాను సంక్రాంతి రోజు సాయంత్రానికి విడవలూరు చేరుకుంటాననీ చెప్పాడు.

తను ముందే నిర్ణయించుకున్న ప్రకారం కావాలనే ఆ పొళ్ల కమ్మలు మర్చిపోతూ పిల్లలతో విడవలూరు బయల్దేరింది సులోచన.

* * *

లక్ష్మీకాంతమ్మ సంక్రాంతి పండగను తన భర్తలాగానే విపరీతంగా ప్రేమిస్తుంది. నెల్లూరు జిల్లాలో 'పెద్ద పండగ'అని పిలవబడే ఈ పండగకి కోస్తా జిల్లాల లాగానే చాలా హడావిడి ఉంటుంది. ఎంత పేదలైనా అరిసెలు చేయడానికని రోట్లో బియ్యాలు దంచుతూ కనిపిస్తారు. వాటితోబాటూ లడ్లూ, మురుకులు కూడా చేస్తారు. అవి అందరికీ పంచుతారు. అందరూ కొత్త బట్టలు కొంటారు. పిల్లలు కొన్ని రోజుల ముందునుంచే చెత్తాచెదారాన్నీ, కంపనూ చేర్చిపెట్టి భోగిమంటలు వేయాలని ఉబలాటపడతారు. ఆ మంటల్లో తేగలు కాలుస్తారు. పొంతలతో నీళ్లు కాస్తారు. రైతు కుటుంబాల్లో తమవద్ద పనిచేసే పాలేళ్లకూ, పనివాళ్లకీ కొత్త బట్టలివ్వడమేకాక కడుపునిండా భోజనాలు పెడతారు. ఐతే సంస్కృతులు మారుతుండడంతో పండగ నిర్వహణ కొంతవరకూ పలచబడ్డదనే చెప్పాలి. ఐనా పాత వాసనలు వదలని లక్ష్మీకాంతమ్మలాంటివాళ్లు మాత్రం ఆనాటి పరంపరను ఇంకా కొనసాగిస్తునే ఉన్నారు.

సులోచన పుట్టింటికి చేరగానే రహస్య గూఢాచారిణిలాగా ఇంట్లో ఏమేం వస్తువులున్నయ్? ఏయే వస్తువులు సువర్చలకివ్వబడ్డాయి అనే విషయాలు గమనిస్తుంటుంది. ఐతే ఈసారి మాత్రం ఆమెకు తన తల్లిని గమనించడానికే సరిపోయింది. కారణం లక్ష్మీకాంతమ్మ బాగా చిక్కిపోయి నల్లబడ్డది. పిల్లలను చూసి లేని ఉత్సాహం తెచ్చుకుందని తెలిసిపోతూ ఉంది.

"అక్కకీమధ్య ఆరోగ్యం బాగలేదు సులో" అన్నది భాగ్యమ్మ పిన్ని.

"ఏమైంది"? అడిగింది సులోచన.


"పనిచేస్తూ చేస్తూ హఠాత్తుగా నీరసపడిపోయి పడుకుంటుంది. పొలం వెళ్లిన రోజుల్లా జ్వరాన పడుతుంది."


"డాక్టరుకు చూపించలా?"

"నెల్లూర్లో చూపించాము. మద్రాసుకెళ్లి అన్నీ చెకప్ చేయించుకోమన్నారు"-

భాగ్యమ్మ చెప్పింది విన్నాక ఆలోచించింది సులోచన. "పిన్ని మాటల సారాంశం తనని చెకప్ చేయించమనేగా? విజయవాడనుంచి తామరతంపరగా వచ్చిపడ్తున్న వస్తువులూ, పొలంలో పంటా ఇతర రాబడులన్నీ చెల్లెలిపరంచేస్తూ ఉందిగా? అంతమాత్రం చెకప్ చేయించలేరా? ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్న తనొస్తే గానీ ఆ చెకప్ జరగదా? వీళ్లంతా ఎంత అవకాశవాదులో అమ్మకిప్పటికైనా తెలిసొచ్చిందా?"

(మిగతా 27వ పేజీలో)






★ త్రిఫలా గుగ్గులు రెండు మాత్రలు- రోజుకు మూడుసార్లు సేవిస్తే కళ్ళకలక తగ్గుతుంది.

**(19 పేజీ తరువాయి)**

సంక్రాంతి పండగ రోజు సువర్చల వంగపండు రంగు పట్టుచీర కట్టుకుంది. "అరె! ఇది తను మొన్న విజయవాడలో అమ్మకి కొనిపెట్టిన చీర. ఎవ్వరికీ ఇవ్వ కమ్మా అని చెప్పి మరీ ఇచ్చింది! ఐనా అది సువర్చల పాలైంది" అనుకొని బాధపడ్డది సులోచన. ఆ బాధతో కోపంతో పండగనాడు భోంచేయనని మొరా యించి, మూల గదిలో పట్టెమంచం మీద ముసుగే సింది.

లక్ష్మీకాంతమ్మ కంగారుగా కూతుర్ని చేరి "అదేంట మ్మాయ్? పండగనాడు భోంచేయకుండా? లే... లే..." అంది.

కాస్సేపు బతిమిలాడించుకున్నావ్ "అమ్మా! నువ్వె ప్పుడైనా నా మాట విన్నావా" అడిగింది సులోచన.

"అయ్యో! నీ మాట కాక ఇంకెవరి మాట వినా లమ్మా నేను? మీ నాన్నలాగానే నీకూ ముక్కుమీద కోపం. నా బుజ్జి తల్లివి కదూ! లేమ్మా".

"మరి ఆ చీర సువర్చలకెందుకిచ్చావు."

"బస్. దానికేనా కోపం! బిడ్డకి చీర కొని సంవత్సర మైందమ్మా. మనందరం కొత్త బట్టలు కట్టుకుని, దానికి లేకపోతే, అందరి ముందూ మనకేకదమ్మా అవమానం? నా దగ్గర బోలెడన్ని వెంకటగిరి చీరలు మూలుగుతున్నాయ్. పెద్దదాన్ని. ఏది కట్టుకుంటే పండగ జరగదు? మొన్న మిరపతోట మీదొచ్చిన డబ్బులని, శంకరానికీ పిల్లలకీ కూడా బట్టలు కొన్నాను. నీకిక్కడివి నచ్చవని, నీకు పిల్లలకీ, ఇదో ఈ మూడువేలు అట్టిపెట్టాను. అల్లుడుగారికి వేరే. నువ్వు విజయవాడ వెళ్లాక కొనుక్కోమ్మా"... బొడ్లో నుంచి మూడు వెయ్యి రూపాయల నోట్లు తీసి బెడ్ మీద పెడుతున్న తల్లిని చూసి సిగ్గుపడ్డది సువర్చల.

తనకివ్వలేదనా తను కోప్పడుతూన్నది? ఇచ్చినది చ్చినట్టు అన్నీ చెల్లెలికి దోచిపెట్టవద్దనేగా తను చెపు తూంటాం?

ఐనా ఆమాట పైకి అనకుండా "ఇలా డబ్బులన్నీ వృధా చేస్తే నీ ఆరోగ్యానిక్కావల్సి వస్తే అవసరానికెవరి స్తారు? నాకేమీ అక్కర్లేదు." అంది.

"నేనింకా బతికి ఏం చేయాలమ్మా. ఎప్పుడెప్పుడా మహానుభావుణ్ణి చేరదామా అని చూస్తున్నాను. నాకేడాక్టరూ ఏ మందులూ అవసరం లేదు" అని దీనంగా చెపుతున్న తల్లిని చూస్తే సులోచన మనసు కరిగి నీరైంది. మాట్లాడకుండా లేచి భోజనానికి నడి చింది.

ఆ సాయంత్రం పెరట్లో కారేపాకు కోస్తున్న సులో చన కాలుజారి పడడంతో కాలు బెణికింది. సువర్చల ఆమెని మెల్లిగా ఇంట్లోకి నడిపించుకొచ్చి కాలు మర్దనా చేసింది.

అదంతా సహజమైన ప్రేమగా తోచలేదు సులోచ నకి.

తననుంచి ఏదో ప్రయోజనం ఆశించే తనకిలా సేవ చేస్తోంది అనిపించింది.

సంక్రాంతి రోజు సాయంత్రానికి రవి రావడం, మరుసటిరోజు సాయంత్రం అందరూ విజయ వాడ బయల్దేరడంతో ఆ సంవ త్సరం విడవలూర్లో సంక్రాంతి ముగిసింది.



**పదకొండో రోజు కర్మ ముగిసింది. మునుమాపటి వేళ అందరూ అరుబైట కూచు న్నారు. కరెంటు లేదు. అంతా చీకటి చీకటిగా ఉంది. వరం డాలో భాగ్యమ్మ స్తంభానికాను కుని 'ఇక నువ్వే నా కాసరా' అన్నట్టు కూచుని ఉంది.**

* * *

సంక్రాంతి వెళ్లిన మూడు నెల లకి సులోచన మంచి నిద్రలో ఉండగా ఫోను మోగింది.

అవతల్నించి భాగ్యమ్మ పిన్ని.

ఆమె గొంతు గాద్గదికంగా ఉంది. ఏదో శక్తినంతా కూడదీసు కొని మాట్లాడుతున్నట్టుంది.

"సులో అమ్మకి బాగలేదు. ఛాతిలో నొప్పి అంటే నెల్లూర్లో ఆస్పత్రిలో చేర్చాం" అంది.

సులోచన నిద్రమత్తు వదిలి పోయింది. సులోచన ఫోనులో మాట్లాడుతున్నంతసేపూ ఎవరో సన్నగా ఏడ్చినట్టూ, హడావిడిగా జరుగుతున్నట్టూ అవతల నుంచి శబ్దాలు వినిపిస్తూన్నాయ్.

సులోచన గుండె వేగంగా కొట్టుకోసాగింది. వెంటనే రవిని లేపింది. అందరూ బయల్దేరారు ఆ అర్ధరాత్రిలోనే.

ఐతే వీళ్లు విడవలూరు చేరకముందే లక్ష్మీకాంతమ్మ భౌతికకాయాన్ని విడవలూరు చేర్చారు.

* * *

పదకొండోరోజు కర్మ ముగిసింది. మునుమాపటి వేళ అందరూ ఆరుబైట కూచున్నారు. కరెంటు లేదు. అంతా చీకటి చీకటిగా ఉంది. వరండాలో భాగ్యమ్మ స్తంభానికానుకుని 'ఇక నువ్వే నా కాసరా' అన్నట్టు కూచుని ఉంది. ఇంకాస్త అవతల ఒక మూలగా కూచున్న సువర్చల సన్నగా ఏడుస్తోంది. నిశ్శబ్దాన్ని ఊరడిస్తున్నట్టుందామె ఏడుపు. బాదం చెట్టు కింద వాలు కుర్చీలో కూచుంది సులోచన.

ఇంతవరకూ తానెరుగని ఓ కొత్త మనిషి తనలోనుంచి బైటికి వచ్చినట్టుంది సులోచనకి.

ఆమె ఉన్నట్టుండి "సువర్చలా! నీ పర్సిలా పట్టు కరా" అంది.

సువర్చల పర్సు తెచ్చాక లోపలి జిప్‌లాగి ఓ చిన్న పొట్లం తీసింది. అది సువర్చల చేతిలో పెట్టి "ఇవి నీకే" అంది.

అవి పొళ్ల కమ్మలు!

సువర్చల వాటిని చూసి ఆశ్చర్య పోదూ "ఇవి నీకిమ్మని అమ్మ నాతో చాలాసార్లు చెప్పింది" అంది.

భాగ్యమ్మ పిన్ని గబగబా దగ్గరి కొచ్చి వాటిని చూస్తూ "పొళ్ల కమ్మలు! పాపం బావగారు దగ్గి రుండి కంసాలిచేత చేయించినవి! తను చనిపోయేటప్పుడు ఇవి వేసు కోవాలని అంటుండేది అక్క. అందుకే కాబోలు అపస్మారక స్థితిలో కూడా చెవుల తడుము కుంది. ఇవి నీ దగ్గరున్నట్టు నాకు తెలియదే! కాని అక్క ఒక విషయం మాత్రం స్పష్టంగా చెప్పేది. తన తద నంతరం అవి పెద్దమ్మాయివని" అంటూ నిట్టూర్చింది.

అనేక సంవత్సరాలుగా పొడిబారి ఉన్న సులోచన గుండెలో తడి! భరించలేనంత తడి. నిరంతర జీవ ఊటలాగా ఉబుకుతున్న తడి! అంత తడిని ఇముడ్చు కోలేని ఆమె గుండె ఆ తడిని అశ్రువులుగా మార్చి వెలుపలికి పంపింది.

అక్కడ ఏడవడం ఎప్పుడూ చూడని సువర్చల కంగారుపడుతూ ఆమెని గట్టిగా కౌగలించుకుని "అక్కా"అంది.

ఇన్నాళ్లూ సులోచనకీ సువర్చలకీ మధ్యనున్న పెద్ద గోడను కూలదోసిందా కౌగిలి.


వాళ్లిద్దరి మధ్యనున్న ఎన్ని యోజనాల దూరాన్ని మాయంచేసిందా కౌగిలి.


అంతే కాదు. ఆ కౌగిల్లో తానెన్నడూ ఎరుగని వెచ్చ దనాన్నీ భద్రతనూ పొందగలిగింది సులోచన.

కళ్లెత్తి చూసిన ఆమెకి సువర్చల ముఖంలో తన అమ్మానాన్నా ఇద్దరూ మసక మసకగా కనిపించారు.

★


**రచయిత చిరునామా:**
**ఎ.పుష్పాంజలి,**
హౌస్ నెంబర్-3, ఎగువ కురవంక,
మదనపల్లి- 517 325


★ సిఫాగ్రైన్ మాత్రలు పూటకు రెండు చొప్పున మూడు పూటలు మరియు సిఫాగ్రైన్ చుక్కలు ఐదు లేక ఆరు చుక్కలు రోజుకు మూడుసార్లు వాడితే తలనొప్పికి ఉపశమనంగా ఉంటుంది.